
# అంతా మన అదృష్టం

గుమ్మడి రవీంద్రనాథ్

ఈ జన్మలో కథలు



ఆపసోపాలు పడ్తూ సైకిల్ తొక్కుతున్నాడు అదృష్టరావు. ఆంధ్రరాష్ట్రంలోని విద్యుత్ ఛార్జీలకంటే తీక్షణంగా కాస్తోంది ఎండ. అదృష్టరావు ఒళ్ళంతా చెమటలు కారి పోతున్నాయి. సైకిల్ వెనకున్న బరువుకి, ముందు చక్రం ఎక్కడ బ్యాలెన్స్ తప్పి పైకి లేచిపోతుందోనన్న భయం ఉన్నా, జాగ్రత్తగా ఏకాగ్రతతో తొక్కుతున్నాడు. సైకిల్ వెనుక ఉన్న ఆ బరువైన మూటను మనసులో తిట్టుకుంటూనే, సర్వశక్తులూ కూడదీసుకుని ముందుకు పోనిస్తున్నాడు.

అరండల్‌పేట నాలుగోవీధిలోకి తిరిగింది సైకిల్. మూడో యింటి ముందు సైకిల్ ఆపి దిగాడు. అంత బరువు లాగిన ఆయాసం తీర్చుకోవడానికి అరుగుమీద చతికిలబడ్డాడు. జేబురుమాల్తో చెమట తుడుచుకుని, ఆ యింటి కాలింగ్‌బెల్ నొక్కాడు. పావు నిముషం తరువాత తలుపు తెరుచుకుని బయటకువచ్చాడు ఆ యింటి యజమాని - తోటకూర నరేంద్రనాథ్. అరుగుమీద నిస్త్రాణగా కూర్చుని ఉన్న పోస్ట్‌మాన్‌ని చూసి "ఏమైందయ్యా? వడదెబ్బా, పిడుగుదెబ్బా రెండూ ఏకకాలంలో తగిలిన వాడిలా అలాగయ్యావేంటి?" అని అడిగాడు తోటకూర నరేంద్రనాథ్, ఆందోళనగా.

"ఏమవ్వడం ఏంటి సార్. ముందు కొంచెం మంచినీళ్ళిప్పించండి. మీ మేధాసంపత్తి బరువుని లాగీ లాగీ ప్రాణాలు హరించుకుపోయాయ్..."

"ఏంటి? మళ్ళీ తిరిగొచ్చాయా?" అని అన్నాడు తోటకూర నరేంద్రనాథ్.

"సుబ్బరంగా! అసలన్నన్ని పేజీలు ఎట్లా రాస్తున్నారు సార్? ఇంతింత కట్టలు మోయలేకా లాగలేకా నా చేతులూ కాళ్ళూ పడిపోతున్నాయండీ! మానవతా దృక్పథంతో నామీద దయుంచి, ఏదో పేజీ కథలో, అరపేజీ కథలో రాసుకోకూడదా, మీకు పుణ్యముంటుంది. ఇలా రీములకు రీములు నలుపు చేసేసి, అన్ని పత్రికలకీ అన్నన్ని రాసి పంపిస్తుంటే... నా గతేంకాను చెప్పండి. అసలే బక్కప్రాణం. మీ పుణ్యమా అని స్టేషనరీ షాపుల వాళ్ళు రెండు చేతులూ ఆర్జిస్తున్నారు గానీ... నాకు మాత్రం యీ అవస్థ తీరట్లేదు.

"అదేంటయ్యా అదృష్టం అలా అంటావ్? రేపు నా నవలేదైనా సీరియల్‌గా పత్రికలో అచ్చయితే, మొట్టమొదట స్వీటు తినిపించేది నీకే."

"నాకు పునర్జన్మల మీద ఆట్టే నమ్మకాల్లేవు సార్."

"అంటే ఏంటి నీ ఉద్దేశ్యం? అచ్చువ్వవనేగా?"

"అబ్బెబ్బే... అలాంటిదేం లేదు సార్. కాకపోతే మీరు స్వీట్లు పంచేనాటికి, యీ బరువులు మొయ్యలేక ఏకాలో, చెయ్యో పుటుక్కున విరిగి మంచం పట్టానేమోనని భయంగా వుంది. సార్సార్... మీరు ఇన్సూరెన్సు కంపెనీలోనేగా పన్చేసేది. ఇలా బరువులెత్తి లాగీ, ఎప్పుడైనా కాలో చెయ్యో విరగొట్టుకుంటే నష్టపరిహారం చెల్లించే పాలసీ ఏదైనా ఉంటే నాపేర్న ఒకటి తీసుకోండి సార్!"


"ఏమయ్యా... కామెడీగా ఉందా, నా రచనలంటే? చూస్తుండు.... యిప్పుడిలా గోడకక్కొట్టిన బంతి టైపులో తిరిగొస్తున్నా, ఏదో ఒకనాడు నా ప్రతిభను గుర్తించకపోరు వీళ్ళంతా. జ్ఞానపీఠ్ అవార్డు కూడా వస్తుంది చూడు. నా రచనల వల్ల ఈ దేశం పరువు ప్రతిష్టలు పెరిగిపోయే రోజు ఎంతో దూరంలో లేదు."

నరేంద్రనాథ్ ఆవేశమూ, ఆత్మవిశ్వాసమూ చూసేసరికి మరింత భయం వేసేసింది అదృష్టానికి.

"సరే... లోడెక్కడ దించమంటారు?" అడిగాడు ఉసూరుమంటూ.

"ఆ గదిలో వేయ్."

రైతు బజారు కొచ్చిన కూరగాయల లోడ్‌ని దించి గుట్టగా పోసినట్టు, బ్యాగ్‌లోని



కాగితాల గుట్టల్ని ఆ గదిలో గుమ్మరించాడు పోస్ట్‌మాన్ అదృష్టం. అదృష్టం అక్కడ్నుంచి నిష్క్రమించగానే, బిలబిల మంటూ ఆ ఇంటి ముందుకు వచ్చేశారు యిరవై ముప్పై మంది.

"ఎవరయ్యా మీరంతా?" అడిగాడు నరేంద్రనాథ్ నుదురు ముడిచి.

"చిత్తుకాగితాల వ్యాపారం చేసుకునేటోళ్ళం సార్. ఏదో ఒక రేటు చెప్తే, ఆ గోడౌను ఖాళీ ఐపోద్ది. తమరు మళ్ళీ కొత్త సరుకు దించుకోవచ్చు.

❀❀❀

రాత్రి ఎనిమిది గంటలు.

వరండాలో వాలుకుర్చీలో కూర్చుని ఉన్న అదృష్టం కాళ్ళకీ, చేతులకీ పెయిన్‌బామ్ రాస్తోంది అతని భార్య గిలిగింత.

"అబ్బా!..." ఆక్రందన చేశాడు అదృష్టం. "...మెల్లగానే! పచ్చిపుళ్ళులా ఉన్నాయ్."

రెండు నిముషాల తర్వాత భర్తవంక చూసి చెప్పింది గిలిగింత. "నొప్పుల్తో బాధపడ్తే పడ్డారుగానీ, బాగా గట్టి పడ్డాయండీ కండలు...!"

హఠాత్తుగా ఆ మాట అతన్లో హైవోల్టేజీ కరెంట్‌ని నింపింది. నొప్పులన్నీ మర్చిపోయి చటుక్కున లేచాడు. గిలిగింతను అమాంతం ఎత్తేసుకుని, పడగ్గదిలోకి తీసుకువెళ్ళాడు. ఆమె ముఖంలో బోలెడంత ఆశ్చర్యం, థ్రిల్లు. అంతకుముందు చాలాసార్లు భర్తనడిగింది. సినిమాల్లో హీరోలు, హీరోయిన్లను ఎత్తుకున్నట్టు నన్నెత్తుకోరూ ప్లీజ్?" అని. ఇప్పుడు ఇలా అంత సునాయాసంగా రెండు చేతుల్తో తనను ఎత్తేసేసరికి అదృష్టంలో ఒక హీరోనే చూసింది గిలిగింత.

❀❀❀

హెడ్ పోస్టాఫీస్‌లో పోస్ట్‌మాస్టర్ గదిలోకి అనుమతి తీసుకుని వెళ్ళాడు అదృష్టం.

"ఏంటయ్యా? చెప్పు..." నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ల మీద సంతకాలు చేస్తున్నాడాయన ఆ సమయంలో.

"ఏ... ఏంలేద్సార్. నేను అరండల్‌పేటా, దుర్గా అగ్రహారం ఏరియాల కెళ్తున్నాను సర్. ఊళ్ళో యింకెక్కడి కెళ్ళమన్నా వెళ్తాను కానీ, ఈ ఏరియా మాత్రం నేను చేయలేకపోతున్నాను సర్. అరండల్‌పేట ఏరియాకి ఇంకెవరినైనా వెళ్ళమనండి సార్."

పోస్ట్‌మాస్టర్‌కి అదృష్టం 'సమస్య' అర్థమైంది. తోటకూర నరేంద్రనాథ్ 'దెబ్బ' తట్టుకోలేక విలవిల్లాడ్తూ యిలా వచ్చాడని అర్థం చేసుకున్నాడు.

"ఏం చెయ్యమంటావ్ అదృష్టం! మనవాళ్ళంతా భయపడి చస్తున్నారు అటువేపు వెళ్ళడానికి, ఉన్నవాళ్ళల్లో నువ్వే కాస్త కుర్రాడివి, సిన్సియర్‌వి, అడ్జస్ట్ చేసుకో."

"లేదుసార్, నావల్ల కాదు. దీనికంటే ఏ రిక్షా తొక్కటమో, బండి లాగడమో చాలా యీజీ."

"అలాగంటే ఎలా! పోనీ ఎవర్ని పంపమంటావో నువ్వే చెప్పు."

అదృష్టంకి మంచి అవకాశం దొరికినట్లనిపించింది. గుర్నాథం అంటే పడదతనికి. వాడిమీద కసితీర్చుకోవడానికి యిదే అదను అనుకుని, "మన గుర్నాథం రోజూ జిమ్‌కెళ్ళి వెయిట్ లిఫ్టింగులూ గట్రా చేస్తాడు సార్. ఈ బరువులతనికో లెక్కలేదు." సూచించాడు.



"అమ్మో గుర్నాధమా! వొద్దొద్దు. అతనికి లోకల్ ఎమ్మెల్యేతోనూ, రౌడీ మూకలతోనూ లింకులున్నాయ్. అతన్తో పెట్టుకుంటే నాకు డేంజర్. కొన్నాళ్ళిలాగో నువ్వే లాగించెయ్. ఆ తర్వాత చూద్దాం" ఇంక ఆ విషయంపై వాదన వద్దనట్టు చెప్పాడు పోస్ట్‌మాస్టర్.

బాగా నిరాశపడిపోయాడు అదృష్టం. "అంతేలేండి సార్, పేరుకే నేను అదృష్టం. కానీ, నాకు జరిగేదంతా దానికి రివర్స్..." అని వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ, ఏదో ఐడియా స్ఫురించిన వాడిలా, సమస్యను ఇంకో వైపునుండైనా నరుక్కురావడం వీలుపడ్తుందేమో నన్న ఆశతో, పోస్ట్‌మాస్టర్‌కి బాగా దగ్గరగా వెళ్ళి, మెల్లగా తగ్గు స్వరంతో అడిగాడు.

"సార్! పోనీ మానవ హక్కుల పరిరక్షక సంస్థల వాళ్ళెవరికైనా నా బాధ చెప్పుకుంటే, ఏమైనా ప్రయోజన ముంటుందంటారా?"

తను సార్థక నామధేయుడు కావడానికి ఆ సమస్యే ఉపయోగపడబోతోందని - అదృష్టానికి తోచలేదాక్షణం.

❀❀❀

ఆరోజు.

షరా మామూలే. ఒంట్లోని శక్తినంతా కూడదీసుకుని సైకిల్ తొక్కుతున్నాడు అదృష్టం - వెనక ఆ భారీమూటతో. అరండల్‌పేట నాలుగోవీధి మలుపు దగ్గరికి వచ్చేసరికి, తోటకూర నరేంద్రనాథ్ గోడౌన్లో అన్‌లోడ్ చేయవలసిన, గాడ్జిలా లాంటి బ్యాగ్ సైకిల్‌మీద నుండి పొరబాట్న జారి క్రింద పడింది. ఆ పర్వతం సైకిల్ పైనుండి క్రిందపడగానే, వింటినుండి వదిలిన బాణంలా, సర్రున ముందుకు వెళ్ళిపోయింది సైకిల్. అదృష్టం బ్రేక్ వేసి సైకిల్ ఆపాడు. వెనక్కొచ్చి దాదాపు టన్ను బరువున్న నరేంద్రనాథ్ రచనా కౌశలాన్ని రెండు చేతుల్తోనూ సునాయాసంగా ఎత్తి తిరిగి సైకిల్‌మీద పెట్టుకున్నాడు!

అదే సమయంలో - అంబాసిడర్ కార్లో అటుగా వెళ్తున్న ఓ. వ్యక్తి ఆ దృశ్యం చూసి పరమాశ్చర్య పోయాడు. అంతపెద్ద బ్యాగ్ ఎత్తడానికి ఆ పోస్ట్‌మాన్, వీధిలో వెళ్తున్న ఎవరి సాయమైనా తీసుకుంటాడేమో అనుకున్నాడా వ్యక్తి. కానీ... చాలా ఆశ్చర్యంగా... తనంత తానుగా, ఒ...క్క...డే ఆ భారీ మూటని ఎత్తిపారేశాడు! అతని బుర్రలో ఒక ఆలోచన మెరిసింది!!

❀❀❀

"ఇంకొంచెం వేసుకోండి."

భర్త కంచంలో కూర వడ్డిస్తూ ప్రేమగా చెప్పింది గిలిగింత. "...నా చేతివంట తిని బయల్దేర్తే అంతా శుభమే జరుగుతుంది. మీరు తప్పకుండా గెలుస్తారు."

"సరే, వెయ్..." నాటుకోడి కూరతో సంతృప్తిగా భోజనం చేస్తున్నాడు అదృష్టం. "...ఆరేడు నెలలు కోచింగ్ యిచ్చి అదెత్తూ, యిదెత్తూ అంటూ బరువులు మోయించారు నాతో. ఇప్పుడేమో ఆస్ట్రేలియా బయల్దేరమంటున్నారు. పతకం వస్తే సరేసరి, లేకపోతే విదేశాలు చూసినట్టుంటుందని బయల్దేర్తున్నా" చెప్పాడు.

"మీ శక్తి మీకు తెలీడంలేదు. ఆరోజు రోడ్‌మీద

మిమ్మల్ని చూసిన ఆ ఆంధ్రా ఒలింపిక్ సంఘం సెక్రటరీ మీలోని సామర్థ్యాన్ని బాగా కనిపెట్టాడు. ఆయన నమ్మకం నిలబడుతుంది." చెప్పింది గిలిగింత. భోజనం చేసి లేచాడు అదృష్టం.

"హేవండీ...!" భర్త ఛాతీమీద చేయివేసి రాస్తూ "...నన్ను కాసేపు ఎత్తుకోండి, కాస్త ప్రాక్టీస్‌గా ఉంటుంది మీకు" అంది గోముగా.

గిలిగింత 50 కేజీల విభాగంలోకి వస్తుందా, హెవీ వెయిట్ విభాగమా అనుకుంటూ, భార్యను 'లిఫ్ట్' చేశాడు అదృష్టం!

❀ ❀ ❀

భారతదేశం నుండి ఒలంపిక్‌కి ఎన్నికైన క్రీడాకారుల బృందం, సిడ్నీకి వెళ్ళేముందు ఏర్పాటైన విలేఖరుల సమావేశం.

టీ.వీ. ఛానెళ్ళ కెమెరాల ముందు, విలువిద్య పోటీలో పాల్గొనేందుకు ఎన్నికైన ఒకతను చెప్తున్నాడు.

"...చిన్నప్పుడు స్కూల్లో పేపర్ రాకెట్స్ చేసి, మా మాస్టారు వెనక్కి తిరిగి బోర్డుమీద రాసేటప్పుడు ఆయన బట్టతలకి తగిలేలా విసిరే వాణ్ణి. అస్సలు ఒక్కసారి కూడా గురి తప్పేదికాదు. ఆ అనుభవంతో యిప్పుడే పోటీల్లో పాల్గొని, దేశానికి పతకం తెచ్చి పెడదామనుకుంటున్నా."

స్త్రీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఎన్నికైన ఒకామె యిలా అంది. "...పూటకి అడ్డెడు బియ్యం తింటాను. ఆ మాత్రం బరువులెత్తలేనా? బాగా కోపం వచ్చినపుడు ఒక్కోసారి మా ఆయన్ని కూడా అమాంతం ఎత్తి గిరగిరా తిప్పి గేటు బయటకు విసిరేస్తూ ఉంటాను. ఆ అనుభవం దృష్ట్యా, షాట్‌పుట్‌కి వెళ్తే బావుండనుకున్నాను. కానీ..., మా ఆయన నూటయాభై కేజీల శరీర బరువుని దృష్టిలో పెట్టుకుని, మా కోచ్ యీ పోటీకి పంపుతున్నారు."

ఇంకో క్రీడాకారుడు యిలా అన్నాడు.

"...విమానం ఎక్కాలనీ, విదేశాలు చూడాలనీ చిన్నప్పట్నుండీ కోరిక. రాశిఫలాల్లో కూడా అలాగే ఉంది. దానికిదొక మంచి అవకాశంగా భావించాను. దీనికి తోడు మన క్రీడా సంఘాల్లోనూ, సెలక్షన్ కమిటీల్లోనూ ఉన్నటువంటి 'రాజకీయాలు' కూడా యితోధికంగా సహాయపడ్డాయి. ఏదో ఒకదాన్లో చివర్నుండి అయినా సరే ఫస్టురావడానికి నా శక్తివంచన లేకుండా చేస్తానని మనవి చేసుకుంటున్నా."

❀ ❀ ❀

సిడ్నీ.

ఆస్ట్రేలియా.

ఆరోజు వెయిట్ లిఫ్టింగ్ పోటీలు.

అదృష్టానికి డోపింగ్-పరీక్ష జరిగింది. మళ్ళీ అనుమానం వచ్చి రెండోసారి కూడా జరిపారు.

క్లియరెన్స్ వచ్చింది.

కోచ్ ఏదో చెబుతున్నాడు కానీ, అవేవీ అదృష్టం బుర్రకెక్కడం లేదు. అయినా అర్థమైనట్టు తలూపాడు. నలభై ఏళ్ళుగా స్వర్ణపతకాన్ని జయిస్తున్న రష్యా క్రీడాకారుడి తర్వాత అదృష్టం బరిలోకి దిగాడు.

పోటీకోసం పెట్టిన బరువుని ఒకసారి చూశాడు.

ఆ వెయిట్‌లో, తను నరేంద్రనాథ్ కోసం మోసుకుపోయే గోనెసంచినే చూస్తున్నాడు!

న్యాయనిర్ణేతలు, ప్రేక్షకులూ ఊపిరిబిగబట్టారు.

అదృష్టం ఒక్కసారి గట్టిగా శ్వాసపీల్చాడు.

'జై... నరేంద్రనాథ్‌జీ...' అనుకుని, ఆ వెయిట్ మీద చేతుల్ని ఉంచాడు!

❀ ❀ ❀

ఇంట్లోని నలుపు-తెలుపు పోర్టబుల్ టీ.వీ.లో దూరదర్శన్ వార్తలు చూస్తోంది గిలిగింత. ముఖ్యాంశాల్లోని మొదటిదే అది! ఆమె కళ్ళల్లోకి వెలుగు ప్రసరించింది.

**'సిడ్నీ ఒలంపిక్స్‌లో భారత పతాకాన్ని రెపరెపలాడించిన ఆంధ్రతేజం - అదృష్టం.'**

ఆమెకు ఆ వార్త నమ్మశక్యం కానట్లుంది. వెంటనే పక్కింటి లావుపాటి పిన్నిగారింటికి వెళ్ళి చేతి మీద గిల్లించుకుని, తను కలగనటం లేదని నిర్ధారించుకుని వచ్చింది.

"...... పురుషుల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో స్వర్ణం సాధించిన అదృష్టరావు మన తెలుగువాడు కావటం మన రాష్ట్రం అదృష్టం అంటూ ముఖ్యమంత్రి ప్రశంసించారు...." వార్తలు కొనసాగుతున్నాయి.... "అంతే కాక 15 లక్షల రూపాయలను ఆయనకు బహుమతిగా ప్రకటించాడు." ఆ వార్త వినగానే, కళ్ళు తిరిగి దభీమని పడిపోబోయి, 'లిఫ్ట్' చేయడానికి ఇంట్లో భర్త లేడని గుర్తొచ్చి, ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది గిలిగింత.

❀ ❀ ❀

సిడ్నీ నుండి భారత బృందం తిరిగొచ్చాక -

హైదరాబాద్‌లో, అదృష్టాన్ని ఘనంగా సన్మానించింది. రాష్ట్ర ప్రభుత్వం. ఆ సభలో - అదృష్టం మాట్లాడ్తూ, "... నేనీ ఘనత సాధించడం వెనక బలీయమైన శక్తొకటుంది. అది నా ఉద్యోగం! పోస్ట్‌మాన్‌గా సామాన్య జీవితం గడిపే నేను, నా ఉద్యోగాన్నే దైవంలా భావించాను. ఎంతో నిజాయితీగా, నా విధుల్ని నేను నిర్వర్తించేవాడిని. నిజాయితీతో కూడిన ఆ విధి నిర్వహణే నాకీరోజు యింతటి కీర్తి ప్రతిష్టల్ని తెచ్చిపెట్టిందని నేను నమ్ముతున్నాను. నేను ఉత్తరాలు బట్వాడా చేసే ఏరియాలో, ఎలాగైనా నవలా రచయిత అనిపించుకోవాలని పట్టువదలని విక్రమార్కునిలా పరాక్రమించి, పుంఖానుపుంఖాలుగా అన్ని పత్రికలకీ రచనల్ని పంపే ఒక మహాత్ముని చలువే నా విజయం వెనుక రహస్యం, పత్రికల నుండి తిరిగొచ్చే ఆయన రచనల భారాన్ని సిన్సియర్‌గా మోసీమోసీ, నాకు తెలీయకుండానే నాలో ఒక వెయిట్ లిఫ్టర్ ఉద్భవించాడు. ఆ మహానుభావుడికీ, ఆయన్లోని ఎడతెరిపిలేని పట్టుదలకీ నా కృతజ్ఞతలు. ఇకపోతే చివరగా నేను చెప్పేదొక్కటే. ప్రతిమనిషీ, తన పనిని తాను త్రికరణ శుద్ధిగా చేయాలి. అలా చేస్తే ఏదో ఒకనాడు నాలా హఠాత్తుగా అదృష్టవంతుడైపోయే ఛాన్సులుంటాయి!"

చప్పట్లతో మార్మోగిపోయింది ఆ ప్రదేశమంతా.

❀ ❀ ❀

ఆ రాత్రి -

ఆ సన్మాన సభాకార్యక్రమ విశేషాల్ని సిటికేబుల్‌లో చూశాడు తోటకూర నరేంద్రనాథ్. రాస్తున్న రచనని ఆపి, అదృష్టం మాట్లాడిన మాటలు విన్నాడు.

"... ఆ మహానుభావుడికీ, ఆయన్లోని ఎడతెరిపిలేని పట్టుదలకీ నా కృతజ్ఞతలు..."

తననొక మహానుభావునిగా అభివర్ణించిన అదృష్టాన్ని గుర్తు తెచ్చుకుని పులకించిపోయాడు. తనలో తనే అనుకున్నాడు - 'ఈ దేశం కీర్తి ప్రతిష్టలకి ప్రపంచపటం మీద గుర్తింపు రావడానికి నేను కారణమయ్యాను' - ప్రత్యక్షంగానో, పరోక్షంగానో!'

ఆ ఆలోచన అతన్లో గొప్ప సంతోషాన్ని కలిగించింది. ఆదోలాంటి దేశభక్తి భావనతో ఒళ్ళు పులకరించింది.

ఆ ప్రేరణతో, మరింత విజృంభించి, మరో కొత్తనవలను ఆరంభించేశాడు ఆప్పటికప్పుడే!

**కొసమెరుపు:**

పోస్టాఫీస్‌లో -

పోస్ట్‌మాస్టర్ గదిలోకి వెళ్ళి "నమస్కారం సార్" అన్నాడు గుర్నాథం వినయంగా,

"ఏంటండీ గుర్నాథం గారూ?" అడిగాడు పోస్ట్‌మాస్టర్.

"ఏంలేదు సార్... మరీ... మరీ... " మొహమాటపడ్తూ మాటల్ని మధ్యలో ఆపాడు గుర్నాథం.

"చెప్పండి పర్లేదు."

"అదృష్టానికి మన డిపార్టుమెంటు ప్రమోషనిచ్చి ఆఫీసర్ని చేసేసింది కదా సార్...!"

"అవునూ! అయితే?"

"అతను బట్వాడా చేసే ఏరియాలకి నన్ను పంపండిసార్... ప్లీజ్..."

"ఏం"

"..."

"చెప్పు ఎందుకు? అంత యిదిగా అడుగుతున్నావ్?"

"ఏ... ఏం లేదు సార్. వచ్చే ఒలింపిక్స్‌లో నేనూ... పాల్గొనాలనుకుంటున్నాను. ఇప్పటినుంచీ ప్రాక్టీసు చేసినట్టుంటుందనీ..."

❀